చవితి వచ్చే.. సంబరాలు తెచ్చే

- నేడు వినాయక చవితి
- ఏర్పాట్లు పూర్తి చేసిన మండప నిర్వాహకులు
- పట్టణంలో 500కుపైగా విగ్రహాల ప్రతిష్ఠ
- గ్రామాలకు తరలిన ప్రతిమలు
- పండుగ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట


విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు


చీకటి పడినా కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్


ఎల్‌బీ స్ట్రీట్‌లో ప్రతిష్ఠిస్తున్న భారీ మట్టి అఘోర గణపతి


క్రేన్ ద్వారా మండపానికి గణపతి విగ్రహాన్ని చేరుస్తున్న దృశ్యం


పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

ఆదోనిఅర్బన్ : పట్టణంలో వినాయకచవితి ఉత్సవాల కోసం మండప నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశాచేశారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా పట్టణంలో దాదాపు 500 కు పైగా వినాయక విగ్రహాలను నెలకొల్పనున్నారు. ఆదివారం మండపాల నిర్వాహకులు విగ్రహాలను వాహనాల్లో తరలించారు. విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి మండపాలను సిద్ధం చేశారు.

మార్కెట్‌లో సందడి..

సోమవారం వినాయక చవితి సందర్భంగా పూజించేందుకు భక్తులు పూజ సామగ్రి తదితరాల కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి నెలకొంది. గణనాథుడికి పూజలో వినియోగించే గరక, చెరుకుగడ, జిల్లేడుపూలు, పత్రి, తుమ్మి పూలు, ఉత్తరేణి, అరిటాకులు, అరటి బోదెలు, పూలు, పండ్లు, టెంకాయ, వస్త్రాలు తదితర వాటిని కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ప్రాంతాలు కిటకిటలాడాయి.

మండపాల వద్ద పాటించాల్సిన జాగ్రత్తలు..

వినాయక చవితి సందర్భంగా మండప నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు. మండపాలకు తగినట్లుగా తమ ప్రాంత విద్యుత్‌శాఖ అధికారి వద్ద తగిన రుసుము చెల్లించి రశీదు పొందాలి.

- నాణ్యమైన విద్యుత్ సరఫరా వైర్లను వాడాలి.
- విద్యుత్ వైర్లు జాయింట్ వేస్తే తగు టేప్‌లను వాడాలి.
- విద్యుత్ అలంకరణకు ఉపయోగించే సీరియల్ సెట్లు, డెకరేషన్ లైట్లు ఏర్పాటు చేసేందుకు కర్రలను మాత్రమే ఉపయోగించాలి.
- ఇనుప పైపులు వాడరాదు.
- సీరియల్ లైట్ల కనెక్షన్ కోసం గుండు సూదులను వాడరాదు.
- జాయింట్ వేసి టేపు కట్టాలి.
- బ్యానర్లు కట్టినప్పుడు విద్యుత్ వైర్ల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- లోడుకు కలిగిన కెపాసిటి కలిగిన ఎంసీబీలు మాత్రమే వాడాలి. ఒకవేళ తగిన కెపాసిటీకి వాడినట్లయితే షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదు.
- విద్యుత్ పోల్స్‌ను మండపాల సపోర్టు కోసం వాడరాదు.
- వినాయక నిమజ్జనం కోసం తీసుకుని వెళ్లేటప్పుడు విద్యుత్ వైర్ల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి.
- అవసరమైతే విద్యుత్ సిబ్బంది సహకారం తీసుకోవాలి.

భారీ అఘోర మట్టి గణపతి విగ్రహం..

పట్టణంలోని ఎల్‌బీ స్ట్రీట్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 18 అడుగుల భారీ అఘోర మట్టి వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఈ యేడాది 36వ వార్షికోత్సవమని, అఘోర తపస్సు చేసే విగ్రహమని, అఘోర ముందు వినాయకుడు కూర్చొన్నట్లుగా తీర్చిదిద్దారు.

మంత్రాలయం : చవితి పర్వదినం సందర్భంగా నేడు మంటపాల్లో గణనాథుడు కొలువుదీరనున్నారు. మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో 108 వినాయకులు కొలువుదీరనున్నట్లు ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. అలాగే మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలపల్లి, రచ్చమర్రి, మాధవరం, తుంగభద్ర, సుంకేశ్వరి గ్రామాల్లో వినాయక మంటపాలు ఉన్నట్లు ఎస్‌ఐ కిరణ్‌బాబు వివరించారు. ఇప్పటికే మండలి సభ్యులు మంటపాల ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

క్లుప్తంగా

అలరించిన సంగీత విభావరి


దాస సాహిత్య విభారిలో సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

మంత్రాలయం : శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చాతుర్మాస దీక్షను పురస్కరించుకుని రాఘవేంద్రుల సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు, శ్రీమఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రవచన మంటపంలో మైసూరుకు చెందిన కుమారి రక్షిత, శ్రీమతి రక్షణ బృందం దాసవాణి చేపట్టారు. దాసవాణిలో విధూషిణులు ఆలపించిన సంకీర్తనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో శిష్య సంపర్కాధికారులు వాదిరాజాచార్య, మంచాలి పద్మనాభ ఆచార్య పాల్గొన్నారు.

రాఘవుడి సన్నిధిలో శ్రీశైలం ఈవో


లవన్న దంపతులకు ఆహ్వానం పలుకుతున్న మఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్

మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం శ్రీశైలం ఆలయ ఈవో లవన్న కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. రాఘవేంద్రుల శేషవస్త్రం, అక్షింతలు అందుకున్నారు.

ఎమ్మెల్యేతో హౌసింగ్ పీడీ


ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి బొకే అందజేస్తున్న హౌసింగ్ పీడీ ఎర్రకోట సిద్ధలింగమూర్తి

మంత్రాలయం : ఇటీవల హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఎర్రకోట సిద్ధ లింగ మూర్తి ఆదివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలిశారు. పెద్దకడబూరు మండలం ముచ్చగిరి గ్రామ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలపై చర్చించారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈ వేణుగోపాల్ ఉన్నారు.

వైభవంగా విశ్వకర్మ పల్లకోత్సవం


విశ్వకర్మ చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న విశ్వబ్రాహ్మణులు

మంత్రాలయం : సూర్యుడు కన్య రాశిలో ప్రవేశించిన రోజును కన్య సంక్రమణ పర్వదినం జరుపుకోవడం ఆనవాయితీ. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలో విశ్వకర్మకు విశేష పూజలు చేపట్టారు. ఉదయం విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మకు అభిషేకాలు చేపట్టి పల్లకీలో ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

కోసిగి: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా పోరాటం సాగిస్తున్నామని ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ చిన్నదుర్గప్ప మాదిగ, మంత్రాలయం తాలూకా కన్వీనర్ నాగరాజులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు చింతకుంట సామేల్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కేంద్ర, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడవ రోజున నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఆదోనిరూరల్ : ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నాలుగో రోజు రిలే దీక్షలు నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వై.కె.విశ్వనాథ్ మాదిగ, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వి.వెంకటరత్నం మాదిగ, హైకోర్టు అడ్వకేట్ బైరపాక జయకర్ మద్దతు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని పేకాటరాయుళ్ల స్థావరాలపై త్రీటౌన్ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు చేశారు. ఇందులో 19 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2.31 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నరసింహరాజు తెలిపారు. గతంలో క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన వారిలోనే మహానందితో పాటు 18 మందిని అదుపులో తీసుకున్నట్లు చెప్పారు.

ఎల్‌ఓసీ ద్వారా ఆపరేషన్


ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న రాముడు కుటుంబ సభ్యులు

ఆదోని సెంట్రల్: ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా ఆపరేషన్ చేయించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డికి టి.రాముడు కుటుంబ సభ్యులు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రాముడుకు గనేకల్ వద్ద యాక్సిడెంట్ జరిగింది. చికిత్స కోసం స్థానిక అసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడి వైద్యులు హైదరబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడి డాక్టర్లు తక్షణమే ఆపరేషన్ చేయాలని సూచించారు. తమకు అంత స్థోమత లేదని, ఏమి చేయాలో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళనకు గురువుతున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు కూడా లేకపోవడంతో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం విడుదల కోసం ఎల్‌ఓసీకి దరఖాస్తు చేయించగా ప్రభుత్వం రూ.1,20,000 మంజూరు చేసింది. డాక్టర్లు ఆపరేషన్ చేయడంతో ఆరోగ్యం కుదుట పడింది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బస్సులో చోరీ

ఆదోనిఅర్బన్ : ఎమ్మిగనూరు నుంచి బళ్లారికి వెళ్తున్న బస్సులో ఆదివారం చోరీ జరిగింది. బాధితురాలు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ప్రవీణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరు నుంచి బళ్లారికి పనినిమిత్తం బస్సులో వెళ్తున్నానని, ఆ బస్సులో తన పక్కన ఇద్దరు మహిళలు కూర్చొన్నారని చెప్పింది. తన బ్యాగులో పది తులాల బంగారం ఉందని, తనకు తెలియకుండా ఆ ఇద్దరు మహిళలు బ్యాగ్‌లో నుంచి బంగారం దొంగలించారని తెలిపారు. ఆదోని పట్టణంలో ఆ ఇద్దరు మహిళలు బస్సు దిగి వెళ్లిపోయారని, వెళ్లిపోయిన వెంటనే తాను బ్యాగును చూస్తే ఆ బ్యాగు తెరిచి ఉండడంతో వెంటనే అందులో చూస్తే పది తులాల బంగారం లేకపోవడంతో ఆదోని పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. అయితే పోలీసులు ఎమ్మిగనూరులోనే ఫిర్యాదు చేయాలని తెలపడంతో ఎమ్మిగనూరుకు వెళ్తున్నట్లు ప్రవీణ విలేకరులకు తెలియజేసింది.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళమల్లేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం మాళమల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొందరు భక్తులు సింహాసన కట్ట నుంచి కొండ పైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీసీ వేణుగోపాల్

దేవనకొండ: స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆదివారం ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, జీసీడీఓ కే.సునీత సందర్శించారు. శనివారం కస్తూర్బా పాఠశాలలో కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైందని, రెండు రోజులుగా బోరు నీటిని తాగుతున్నామని విద్యార్థినులు చెప్పారు. పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. క్యాంపస్ శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పది రోజులకోసారి వాటర్ ట్యాంకును శుభ్రం చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, ఏఎన్ఎంపై చర్యలు తీసుకుంటామని ఏపీసీ వెల్లడించారు.

ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్ : ధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలిపారు. ఈ మేరకు ప్రధాని పేరుపై అర్చన, అభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజలు చేయించామన్నారు. నాయకులు విజయకృష్ణ, జిందేసాయికుమార్, జల్లా రాము పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

ఆదోనిఅర్బన్ : సున్ని దావతే ఇస్లామీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం పట్టణంలోని విజన్ ఐ కేర్‌లో ఎస్‌డీఐ సభ్యులు హఫీజ్, గూడూరు మంజూర్‌అహ్మద్, సికిందర్ మాట్లాడుతూ సుమారు వంద మందికి పైగా శిబిరానికి హాజరయ్యారని, డాక్టర్ల సూచన మేరకు పలువురికి అద్దాలు అందజేశామని చెప్పారు. డాక్టర్ జునైద్ వైద్య పరీక్షలు చేశారు.

ఆర్థిక సాయం

కోసిగి: ఆర్లబండ గ్రామానికి చెందిన కురువ అయ్యప్ప (80) అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీమోహన్ రెడ్డి సంతాపం తెలిపారు. మృతిని కుటుంబానికి ఎమ్మెల్యే తరపున గ్రామ నాయకులు గొల్ల పరుశురామ్, ఎంపీటీసీ తాయమ్మ, హనుమప్ప, గాదిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి రూ.5వేలు మృతుడి భార్య యంకమ్మకు అందజేశారు.

20న మండల సర్వసభ్య సమావేశం

కౌతాళం: ఈనెల 20వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అమరేష్ ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్బరాజు ఆదివారం తెలిపారు.కావున మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరవ్వాలని సూచించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. సమావేశంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, పూర్తయిన వాటిపై చర్చిస్తామన్నారు.

గవ్వపై గణనాథుడి ప్రతిమ



ఆదోనిరూరల్ : వినాయక చవితి సందర్భంగా కమ్మరచేడు జెడ్పీ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున నది ఇసుకలో ఉండే గవ్వపై శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్నట్లుగా బాల వినాయక సూక్ష్మ చిత్రాన్ని ఇంచు సైజులో పెయింటింగ్ వేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి


ముచ్చగిరిలో ఓహెచ్‌ఆర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : నియోజకవర్గ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తూనే ఉంటానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దకడబూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముచ్చగిరిలో రూ.22.35 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు, రూ.10.50 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ సెంటర్, నౌలేకల్లులో రూ.17.50 లక్షలతో పూర్తి చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రం, కల్లుకుంటలో రూ.20 లక్షలతో వేసిన తాగునీటి పైపులైన్ నిర్మాణాలకు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ.50 కోట్లు అంచనాతో తాగునీటి పథకాలు, రూ.74.17 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాలు నిర్మించడం జరుగుతోందన్నారు. మనబడి–నాడునేడు కింద 117 పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు గదులు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల రుణం తీర్చుకునేందుకు జగనన్న సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. టీడీపీ నాయకులకు ఇవేమి పట్టడం లేదన్నారు. పార్టీ ఉనికి కోసం టీడీపీ నేతలు ఆరాటపడతున్నారని వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాం, నాయకులు జాము మూకయ్య, ఈరన్న, యల్లప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

బైపాస్ సర్కిల్‌కు మోక్ష గుండం పేరు పెట్టాలి


ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని అస్పరి బైపాస్ సర్కిల్‌కు మోక్ష గుండం విశ్వేశ్వరయ్య సర్కిల్‌గా నామకరణం చేయాలని లైసెన్స్‌డ్ టెక్నికల్ అసోషియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని ఆదివారం ఆయన ఇంట్లో కలిసి విన్నవించారు. అంతకుముందు సంఘం నాయకుడు ఎన్.దేవేంద్రనాథ్ ప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. ఇంజినీరింగ్ విభాగానికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భావి తరాలకు మోక్షగుండం గుర్తుండాలంటే బైపాస్ సర్కిల్‌కు ఆయన పేరు పెట్టాలని కోరారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష చేపట్టిన ప్రభుత్వం
- 15 నుంచి ఇంటింటా సర్వే
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు
- గ్రామాల్లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది
- 30 నుంచి వైద్య శిబిరాలు


కోసిగిలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు


కోసిగిలో మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని సెంట్రల్: ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలోనే గుర్తించి వాటిని పరిష్కరించడానికి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టరు కాన్సెప్ట్, ఆరోగ్యశ్రీ వంటి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రజలకు ఆరోగ్య సేవలనందిస్తోంది. వీటికి అదనంగా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేస్తారు. వివిధ వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి నిర్దేశిత తేదీల్లో ఏర్పాటు చేసే వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులతో చికిత్స చేయించి ఉచితంగా మందులు అందజేస్తారు. ఒకవేళ అత్యవసర చికిత్స అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయిస్తారు. ఇందుకు సంబంధించిన ఇంటింటి సర్వే ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమైంది. 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే..

ఆదోని డివిజన్‌లోని అర్బన్‌లో 6 పీహెచ్‌సీలు, గ్రామీణ ప్రాంతాల్లో 23 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పిహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటరీలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సురక్ష బ్రోచర్లు ఇచ్చి కార్యక్రమం గురించి వివరిస్తున్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు ఉన్న వారికి ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి అందులో వివరాలు వారికి తెలిసేలా చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ఏ సమయంలో ఎలా ఉపయోగించాలో ప్రజలకు వివరిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు ప్రజల వ్యాధుల గురించి తెలుసుకుంటూ వారికి వైద్య పరీక్షలు చేస్తారు. ముఖ్యంగా బీపీ, షుగర్, హెచ్‌బీ, మూత్ర పరీక్ష, టీబీ, మలేరియా, డెంగీ వంటి 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారు. 30వ తేదీ నుంచి నిర్వహించే వైద్య శిబిరానికి ఏ రోజు రావాలో నిర్ణయించి వారికి టోకన్ ఇస్తారు. ఆయా సమయాల్లో వారిని తీసుకొచ్చి చికిత్స చేయిస్తారు. వైద్యశిబిరంలో ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు కూడా ఉంటారు. అత్యవసర పరిస్థితులు ఉన్న వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు తరలిస్తారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి..

గర్భిణులు, బాలింతలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆరోగ్య సురక్షలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న తల్లులు, పిల్లలకు మందులతో పాటు ఫుడ్ సప్లిమెంట్ అందజేస్తారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను 15 రోజులకు ఒక సారి వైద్యులు ఇంటివద్దకు వచ్చి చికిత్స అందించేలా చర్యలు చేపట్టనున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు ఇప్పటికే వైద్య సేవలు అందుతున్నాయి. చాలా గ్రామాల్లో వైద్య సేవలపై సరైన అవగాహన లేక, అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకోలేని వారికి ఈ కార్యక్రమమంచి అవకాశం. సురక్ష కార్యక్రమం అమలుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే గ్రామాల్లో ఇంటింటి సర్వే, వైద్య పరీక్షలు తదితర వాటిని ముమ్మరం చేశాం. సిబ్బంది వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

– సత్యవతి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

మహాసభలను జయప్రదం చేయండి

ఆదోనిరూరల్ : సాగుభూములు, సామాజిక న్యాయం ఉపాధి సాధన కోసం ఈనెల 25, 26, 27వ తేదీల్లో బాపట్లలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలకు వ్యవసాయ కూలీలు తరలివచ్చి జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని స్థానిక బుడేకల్‌లోనున్న సీపీఐ కార్యాలయంలో మండల సమావేశం సీపీఐ మండల కార్యదర్శి కల్లుభావి రాజు అధ్యక్షతన జరిగింది. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఏఐటీయూసీ పట్టణ ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా సమితి సభ్యులు షేక్షావలి పాల్గొన్నారు.